లక్ష ఓట్లే లక్ష్యం!


మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, పక్కన ఎమ్మెల్సీ ప్రభాకర్ తదితరులు

- ముషీరాబాద్‌లో ప్రభుత్వ లబ్ధిదారులు 1.08 లక్షలు
- అందరినీ కలవాలిని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- నన్ను ఎదుర్కోలేకే బీజేపీ, కాంగ్రెస్‌లు ఏకం
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: గత ఎన్నికల్లో 73 వేల ఓట్లు సాధించామని ఈ ఎన్నికల్లో లక్ష ఓట్లు సాధించడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం కషిష్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వై.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ముషీరాబాద్ నియోజకవర్గ పార్టీ జనరల్ బాడీ సమావేశం, ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జీ, ఎమ్మెల్సీ ప్రభాకర్‌తో కలిసి ప్రసంగించారు.

- ముషీరాబాద్ నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాలు అందుకునే వారు 1.08 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వారందరిని ఇంటింటికీ వెళ్లి కలవాలని సూచించారు. ప్రత్యర్థి బలంగా ఉన్నప్పుడు శత్రువులు అందరూ ఏకమవుతారని అందుకే నన్ను ఎదుర్కోలేక ముషీరాబాద్‌లో బీజేపీ, కాంగ్రెస్‌లు ఏకమవుతున్నాయని ఆరోపించారు.
- బీజేపీ, కాంగ్రెస్‌లకు కేడర్ లేదని ప్రజల్లో స్పందన అంతకంటే లేదని ఎద్దేవా చేశారు. అయితే మనలోని కొంత మంది నేతల మధ్య ఉన్న మనస్పర్థలను ఆసరా చేసుకొని వాటిని తమ రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు వాడుకుంటున్నారని తెలిపారు. గులాబీ జెండా కప్పుకున్న ఏ కార్యకర్తా ఇలాంటి ప్రలోభాలకు లోనుకారని స్పష్టం చేశారు.

అసమ్మతి సెగ చల్లాచ్చాలి: ఎమ్మెల్సీ ప్రభాకర్

- పార్టీ శ్రేణుల ఉత్సాహం చూస్తుంటే ముఠా గోపాల్ మరోసారి గెలుపు ఖాయమనే భావం కలుగుతున్నదని సర్వేలు కూడా అదే చెబుతున్నాయని ఎన్నికల ఇన్‌చార్జీ, ఎమ్మెల్సీ ప్రభాకర్ స్పష్టం చేశారు. గత 50 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, మైనార్టీ బంధు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తూ వారికి సీఎం సీటు మీద ఆలోచనే తప్ప ప్రజల సంక్షేమం కోసం కాదని ఎద్దేవా చేశారు. లక్ష మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారంటే ముషీరాబాద్‌లో సంక్షేమం ఎంతబాగా అమలు అవుతుందో అర్థమవుతుందన్నారు. అయితే అతి నమ్మకం పనికి రాదని గత మున్సిపల్ ఎన్నికల్లో ఇదే ఓవర్ కాన్ఫిడెన్స్ కొంపముంచిందన్నారు. నాయకుల్లో తమలో ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా నాతో మాట్లాడవచ్చునన్నారు. పార్టీకి ఎంతో చేసిన పార్టీ మాకు ఏమి ఇవ్వలేదని కొంత మంది నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వారితో కూడా మాట్లాడుతానని తెలిపారు. అసంతృప్తిగా ఉన్న ప్రతి నాయకుడి ఇంటి వద్దకు వెళ్లి మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు.
- కార్యక్రమంలో నేతలు ముఠా జైసింహ, వివిధ డివిజన్ల అధ్యక్షులు బి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మోజెస్, నర్సింగ్‌ప్రసాద్, శ్యామ్‌యాదవ్, రాకేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, రెబ్బ రామారావు, శివముదిరాజ్, కొండపల్లి మాధవ్, చిట్టి, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, ముదిగొండ మురళీ, డాక్టర్ విజయలక్ష్మి, సుధాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పలువురు నేతల గైర్హాజర్...

దివంగత నేత నాయిని నర్సింహారెడ్డి అల్లుడు, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు, ఎడ్ల హరిబాబుయాదవ్, అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ సునీతప్రకాష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ రవీందర్, మనోహర్‌సింగ్, యాదగిరి తదితర నేతలు ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశానికి హాజరుకాకపోవడం గమనార్హం.


హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

తిలక్‌నగర్ బస్తీ కమిటీకి ఎన్నికలు నిర్వహించాలి

నల్లకుంట: నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ బస్తీ ఎమిటీ ఎన్నికలు నిర్వహించాలని బస్తీ అడహక్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. చాలా సంవత్సరాలుగా కమిటీ ఎన్నికలు నిర్వహించకుండానే పాత కమిటీనే కొనసాగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం తిలక్‌నగర్ బస్తీ నూతన అడహక్ కమిటీ ఏర్పాటైంది. ఈ సందర్భంగా బస్తీ కమిటీ అధ్యక్షుడు అడల శ్రీకాంత్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా జి.రాఘవేంద్ర రావుతో కలిసి మాట్లాడుతూ... తిలక్‌నగర్ బస్తీ కమిటీ అనధికారికంగా కొనసాగుతుందని ఆరోపించారు. ఇప్పటి వరకు ఇప్పటి వరకు కొనసాగుతున్న అనధికార కమిటీని రద్దు చేస్తూ బస్తీ వాసులందరూ ఏకగ్రీవ తీర్మానంతో నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్నారని వారు తెలిపారు.

మహిళా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

కాచిగూడ: మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని స్త్రీ హస్తిన మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ ఎర్రం పూర్ణ శాంతి గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్త్రీ హస్తిన మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా మహిళా సమ్మేళనం అలయి.. బలయి.. కార్యక్రమంలో ఆమె పాల్గొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను సత్కరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు. నాయకురాళ్లు శశిశ్రీ, డాక్టర్ కె.రాజ్యలక్ష్మీ, మీరా, తిలోత్తమ లావణ్య, తోట ప్రవీణ, తులసి, స్నేహా, వర్ష అర్చన, డాక్టర్ హరిప్రియా, సుచిత్రా, చిరంజీవి సాత్విక తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి 'ఆప్' నాయకులు

లిబర్టీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ఢిల్లీ బయలుదేరి వెళ్లింది. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు వచ్చే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై జాతీయ నాయకత్వంతో చర్చించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ సారథ్యంలోని ప్రతినిధి బృందం గురువారం ఢిల్లీ బయలుదేరింది. పార్టీ జాతీయ కన్వీనర్ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జీ శాసన సభ్యులు సోమనాథ్ భారతితో పాటు రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో సమావేశం కానున్నారు. తెలంగాణలో ఆమ్ ఆద్మీ పార్టీ పరిస్థితి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అంశం పోటీ చేస్తే ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి, రాష్ట్రంలో పార్టీని పటిష్ఠ పరచడం విస్తరించడం బలోపేతం చేయడం తదితర అంశాలను వివిధ ప్రధాన రాజకీయ పార్టీల పరిస్థితి వంటి విషయాలను అరవింద్ కేజ్రీవాల్‌కు వివరిస్తామని డాక్టర్ సుధాకర్ తెలిపారు. ప్రతినిధులు బృందంలో కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము తదితరులు ఉన్నారు.

'రాజ్యాంగాన్ని-దేశాన్ని రక్షించుకుందాం': ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: దేశ పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి, కె.ధర్మేంద్ర విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభల సందర్భంగా 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం-దేశాన్ని రక్షించుకుందాం' అనే నినాదంతో వీధి నడక ప్రచారం నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లో ప్రతి ఇల్లు, వ్యాపార సముదాయాలు తిరిగి రాజ్యాంగాన్ని-దేశాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి, ధర్మేంద్ర మాట్లాడుతూ... అక్టోబర్ 29, 30వ తేదీలలో హిమాయత్ నగర్‌లోని తెరాపంత్ భవన్‌లో ఏఐవై ఎఫ్ రాష్ట్ర 2వ మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, నేతలు మాజీద్, కళ్యాణ్, చెట్టుకింద శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

హిమాయత్‌నగర్: హెచ్ఎంటీ సంస్థలో ఒక డివిజన్‌గా ఉన్న బాలానగర్‌లోని ప్రాగాటూల్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు 5 నెలలుగా జీతాలు చెల్లించటం లేదని, రిటైరైన కార్మికులకు 5 సంవత్సరాలుగా పీఎఫ్ కానీ, గ్రాట్యుటీ కానీ చెల్లించలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. రిటైరైన కార్మికులందరూ ఎలాంటి ఇతర ఆదాయం లేక, పీఎఫ్, గ్రాట్యుటీ రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హెచ్ఎంటీ యాజమాన్యం, పీఎఫ్ అధికారులు కానీ కార్మికుల బాధలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. బాలానగర్‌లో ప్రాగాటూల్స్‌కు సుమారు 40 ఎకరాలు స్థిరాస్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు తొలగకపోవటానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రాగాటూల్స్‌కు ఉత్పత్తి చేయటానికి ఆర్డర్స్ ఉన్నా పెట్టుబడి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రాగాటూల్స్‌కు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ఉత్పత్తి సక్రమంగా నడవటానికి చర్యలు చేపట్టాలని బోస్ డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- కాచిగూడ పాదయాత్ర.. ఎన్నికల ప్రచారం

కాచిగూడ: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా కాలనీలు, బస్తీల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలను వివరిస్తూ.. కారు గుర్తుకు ఓటువేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు స్పష్టం చేశారు.

- పేద కుటుంబాలకు సన్న బియ్యం, తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా, దివ్యాంగులకు రూ. 6016 పెన్షన్‌లు, రూ.400లకే వంట గ్యాసు, సౌభాగ్యలక్ష్మీ, అర్హులైన పేద మహిళలకు నెలనెలా రూ. 3 వేల జీవన భృతి, పేదలకు ఇండ్ల స్థలాలు, ఆరోగ్య శ్రీ గరిష్ఠ పరిమితి రూ. 15 లక్షలు, స్వయం సహాయక మహిళా సంఘాలకు సొంత భవనాలు, మైనార్టీల సంక్షేమం కోసం రెసిడెన్షియల్ కాలేజీలను ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని అన్నారు.
- వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ప్రతి నెలనెలా పింఛన్ అందజేస్తామన్నారు.


కాచిగూడలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

కాచిగూడలో అత్యధిక మెజార్టీ సాధించాలి...

- కాచిగూడ లింగంపల్లిలోకి కర్ణాటక సాహిత్య మందిర్‌లో గురువారం బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి అవసరం అయిన ప్రణాళికలు తెలిపి వారికి దిశా నిర్దేశం చేశారు. ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని, మిగతా పార్టీల వారు మోసం చేసి మొహం చాటేసిన వాళ్లని ఎమ్మెల్యే ఆరోపించారు.
- ప్రజలు మన పక్షానే ఉన్నారని, అయినా మనం ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ లీడర్ ఆర్.జ్ఞానేశ్వర్ బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.
- సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, నేతలు డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కుట్ర

- 'రైతు బంధు' ఆపాలని లేఖ దుర్మార్గం
- ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రైతు బంధు పథకాన్ని ఆపాలని కుట్రలు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు లేఖలు రాయడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ విమర్శించారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటి అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో గురువారం రైతు బంధు పథకాన్ని ఆపాలని కాంగ్రెస్ పార్టీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముషీరాబాద్ నుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్ సారథ్యంలో బీఆర్ఎస్ నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రభాకర్ మాట్లాడుతూ... అన్నదాతలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం పేద ప్రజలకు అందజేసే సంక్షేమ పథకాన్ని అమలును నిలిపి వేయాలని కాంగ్రెస్ నేతలు కుట్రలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఎక్కడ కూడా రైతు బంధు, దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాలను అమలు చేయడం లేదని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెటి అధికారంలోకి రావాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం తథ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, పార్టీ నాయకులు రెబ్బ రామారావు, సుధాకర్‌గుప్తా, మాధవ్, శివముదిరాజ్, శ్యామ్‌సుందర్, పెంటారెడ్డి, శ్రీధర్‌చారి, శోభ, ముక్తార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


భోలక్‌పూర్‌లో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్సీప్రభాకర్, ఎమ్మెల్యే గోపాల్

బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

తెలంగాణ బ్రాహ్మణ పరిషత్

నల్లకుంట: బ్రాహ్మణ సంక్షేమం కోసం పాటుపడాల్సిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో నిర్వహణ లోపాలు ఉన్నాయని, కమిటీలో భేషజాలు అధికమయ్యాయని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ (టీబీపీ) రాష్ట్ర శాఖ ఆరోపించింది. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ విధివిధానాలను ఎండగట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సొసైటీని తక్షణమే రద్దు చేసి కార్పొరేషన్‌లా డిక్లేర్ చేయాలని టీబీపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం న్యూ నల్లకుంటలోని న్యూరామాలయం ప్రాంగణంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. టీబీపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచంపల్లి రమణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ విస్తరణతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టీబీపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య మాట్లాడుతూ... ప్రభుత్వం బ్రాహ్మణుల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన పేద బ్రాహ్మణులకు అందడంలేదన్నారు. సంక్షేమ పథకాలకు ఈడబ్ల్యూఎస్ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీబీపీ కోశాధికారి బిన్నూరి ప్రశాంత్, ఉపాధ్యక్షులు దేవన్నగారి వాసుదేవ శర్మ, గొబ్బూరి శైలజ, కొత్ర సతీష్ శర్మ, వర్కింగ్ ప్రసిడెంట్ గంగు నవీన్, సంయుక్త కార్యదర్శి ఔరపల్లి రాధిక, హెల్త్ సర్వీసెస్ ఐవీఎస్ పవన్, మార్కెటింగ్ కార్యదర్శి సురభి శ్రీచరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీబీపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య

మాధవపెద్ది సత్యం స్వరం విలక్షణం


పురస్కారాలను ప్రదానం చేస్తున్న గోపీనాథ్‌రెడ్డి, రాము, సురేష్

చిక్కడపల్లి: మాధవపెద్ది సత్యం స్వరం విలక్షణం, వైవిధ్యంతో కూడి ఉంటుందని రిటైర్డ్ డీజీపీ డాక్టర్ సి.ఎన్.గోపీనాథ్‌రెడ్డి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో గురువారం రాత్రి శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు సినీ నేపథ్య గాయకుడు మాధవపెద్ది సత్యం శత జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా గోపీనాథ రెడ్డి పాల్గొని సుస్వరభారతి పురస్కారాలను ఆమని, రావూరి మాధవి జ్యోర్మయి బొమ్మలకు ప్రదానం చేశారు. శ్రీ భారతి మాధవపెద్ది శతజయంతి పురస్కారాలను నటి సర్గికి సబితకు మాధవపెద్ది కుమార్తె నాగలక్ష్మికి పాడుతా తీయాగా ఫేమ్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శ్రీ భారతి వ్యవస్థాపకుడు సురేష్ చింతలపాటు క్రమం తప్పకుండా తప్పకుండా మాధవపెద్ది జయంతిని జరుపుతారన్నారు. కవి డాక్టర్ ఎం.కె.రాము, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, విశ్వనాథ్ మద్దిపట్ల పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత టీఆర్టీ కాలనీ ఎన్నికలు

నల్లకుంట: టీఆర్టీ కాలనీ ప్రజల అభిప్రాయం మేరకే రాష్ట్రంలో త్వరలో జరుగనున్న ఎలక్షన్స్ తర్వాత టీఆర్టీ కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించామని టీఆర్టీ కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. గురువారం నల్లకుంట డివిజన్‌లోని టీఆర్టీ కాలనీలో కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ కమిటీ ప్రతినిధులు కె.శంకర్, ఎన్ మహేష్ కుమార్, పీవీ రవింద్రన్, అనిల్ మాట్లాడారు. అసోసియేషన్ కమిటీ పాలక మండలి గడువు ముగిసినందున అడ్‌హక్ కమిటీ సభ్యుల సూచన మేరకే పాత కమిటీ గడువును పొడిగించామని తెలిపారు. సమావేశంలో టీఆర్టీ కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేన్ సభ్యులు మహ్మద్ అబ్బాస్, జెస్సీ దాస్, విజయ్ కుమార్, నర్సింగ్ రావు, ధర్మరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహేష్ కుమార్

28న స్వతంత్ర భారతికి తెలంగాణ సంగీత హారతి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంలో భాషా కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న స్వతంత్ర భారతికి తెలంగాణ సంగీతభారతి పేరిట దుబాయిలో గాన విభావరి నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు మధుబాపు శాస్త్రి తెలిపారు. దివ్యకాంతి, ప్రశాంతి, శ్వేత, ప్రగతి, శశిధరం, మల్లేష్‌లు గాన విభావరి, చిన్నారి నైశిత నృత్యంతో పాలుపంచుకుంటారన్నారు. ఈ సందర్భంగా నటుడు సాయికిరణ్, వ్యాపారవేత్త రామ్‌కుమార్, రామచందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారి టిఆర్‌కె రావుతోపాటు విష్ణుప్రసాద్, డబ్బింగ్ కళాకారుడు ఆర్‌సి ఎం.రాజు, జ్యోతిష్కుడు బుట్టి వీరభద్రదైవజ్ఞ, సత్యం, తిరుపతి కార్యక్రమ కన్వీనర్ శ్రీనివాస్ పార్తిలకు సత్కారం ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం చిక్కడపల్లిలో ఆవిష్కరించారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం: కార్పొరేటర్ సంగీతాయాదవ్

పంజగుట్ట: సంక్షేమ పథకాలు అన్నీ అమలు కావాలంటే తిరిగి బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని సోమాజిగూడ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ అన్నారు. గురువారం సోమాజిగూడ డివిజన్ ఎంఎస్ మక్తాలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు పంపిణీ చేశారు.

30 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: ఎన్నికల సందర్భంగా మార్కెట్ పోలీసులు చేస్తున్న తనిఖీల్లో 30 తులాల బంగారం పట్టుబడింది. గురువారం సాయంత్రం మార్కెట్ పోలీసులు మోండా మార్కెట్‌లో వాహనాల తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడిని నిలిపి తనిఖీలు చేయగా 30 తులాల బంగారం ఆభరణాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన ఎలాంటి రసీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

పార్టీల మేనిఫెస్టోల్లో పిల్లల సంక్షేమానికి హామీలేవి?

బాలల హక్కుల సంఘం అధ్యక్షురాలు అనురాధరావు

రామంతాపూర్: రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలు ప్రకటించిన తమ ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేశాయి. అన్ని పార్టీలు అన్ని వర్గాలకు అన్ని రకాల హామీలను చేర్చారు. కానీ పిల్లల హక్కులు, వారి సంక్షేమానికి పార్టీ ఏమి చేస్తుందని మేనిఫెస్టోలో చేర్చడం మరిచిపోయాయని గురువారం విడుదల చేసిన ప్రకటనలో బాలల హక్కుల సంఘం అధ్యక్షురాలు అనురాధ రావు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఓటర్లుగా మారే పిల్లల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన వాటిని మేనిఫెస్టోలో చేర్చకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, విద్యార్థులను వేధిస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా పార్టీల మేనిఫెస్టోలో చేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

అందరికీ అందుబాటులో ఉంటా..

కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీఆర్

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని అరవింద్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అన్ని డివిజన్లలో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, సుర్వి మురళీగౌడ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, ఎడ్వర్డ్ సాయిలు, సోమనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట టికెట్ పద్మశాలీలకు కేటాయించాలి


మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి హరి

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలో పద్మశాలీల జనాభా అధికంగా ఉందని, జనాభా దామాషా ప్రకారం ఎన్నికల్లో అన్ని పార్టీలు పద్మశాలీలకు టికెట్ కేటాయించాలని అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలీ సంఘం డిమాండ్ చేసింది. గురువారం నల్లకుంట టీఆర్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి హరి మాట్లాడారు. అంబర్‌పేట నియోజకవర్గంలో 25 వేలకు పైగా పద్మశాలీ ఓటర్లున్నారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అధిష్టానాలు పద్మశాలీలకు టికెట్ కేటాయిస్తే తమ అభ్యర్థులను గెలిపిస్తామన్నారు. లేనిపక్షంలో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి 'మా ఓటు మాకే' నినాదంతో పద్మశాలీల సత్తా చూపుతామన్నారు. గతంలో బీజేపీ నుంచి ఆలె నరేందర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే గెలిపించుకున్నామని ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. సమావేశంలో సంఘం, ఉపాధ్యక్షుడు శంకరగిరి నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి సిలివేరు జమసింహా, కోశాధికారి నక్క నరేష్, సంయుక్త కార్యదర్శి కైరంకొండ శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నక్క నాగేష్, మరౌట్టి వినోద్, ఆదమ్ యాదగిరి, నక్క మోహన్, గద్దే జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌కు చెందిన సుజాత, మమత, అనురాధా, షహీర్, ముస్కాన్‌లతో పాటు 30 మంది మహిళలు గురువారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, నేతలు మహ్మద్ ఖదీర్, రవి యాదవ్, సుధాకర్‌గుప్తా, పరశురామ్, ముకుందరెడ్డి, మాధవ్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు

కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్


మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

లిబర్టీ: కాళేశ్వరం ప్రాజెక్టులో వేల కోట్ల రూపాయల అవినీతి చోటుచేసుకొని మేడిగడ్డ వంతెన పిల్లర్లు కుంగి పోయేందుకు కారణమైన సీఎం కేసీఆర్, ఇరిగేషన్ మంత్రి, ప్రభుత్వ కార్యదర్శులు, ఇంజినీర్‌లు, నిర్మాణ సంస్థపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఈ మొత్తం అవినీతి, అక్రమాలన సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ చేపట్టాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. కేసీఆర్ అక్రమ ఆస్తులను జాతీయం చేయటానికి రాష్ట్రపతి, సుప్రీం కోర్టు చర్యలు చేపట్టాలని కోరారు. గురువారం దళిత బహుజన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రూ. 17 వేల కోట్ల మిగుల బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే రూ. 6 లక్షల కోట్ల మేర అప్పులు చేసి రాష్ట్ర ఖజానాని కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆయన ఆరోపించారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ వ్యాపార వర్గానికి దోచిపెట్టారని ఆరోపించారు. దళితుల సబ్ ప్లాన్ నిధులను రూ. 2 లక్షల కోట్లు దోచుకొని దళిత జాతి అభివృద్ధిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై విచారణ చేసి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.